క్లుప్తంగా

ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి



చిన్నయ్య

రామభద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్‌ఐ ఎస్.చిన్నయ్యకు ఎస్‌ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఈయన 2015 నుంచి 2021 వరకు చీపురుపల్లి, 2021 నుంచి 2024 వరకు రామభద్రపురం పోలీస్‌స్టేషన్లలో ఏఎస్‌ఐగా పనిచేశారు. ఈ నెల ఒకటో తేదీన ఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీచేశారు. ముందుగా రేంజ్ ఆఫీస్‌కు పంపిస్తూ తర్వాత జిల్లాలో ఎస్‌ఐగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, ఏ స్టేషన్‌లో నియమించేది అనేది తెలియాల్సి ఉందని చిన్నయ్య తెలిపారు. ఏ స్టేషన్ నియమించినా అక్కడి సిబ్బంది సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

వీధికుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు



మారుతీనగర్‌లో పట్టుకున్న కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

రాజాం: వీధికుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక పట్టణంలోని మారుతీనగర్, సారధి, డోలపేట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగాడుతున్న శునకాలను సంబంధిత సిబ్బంది ఆదివారం పట్టుకుని, ఆపరేషన్లకు తరలించారన్నారు. ఒక్కో కుక్క ఆపరేషన్‌కు హరియాణాకు చెందిన స్నేహ్ యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి రూ.1500 చొప్పున మున్సిపాలిటీ నిధుల నుంచి చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక



సంతకవిటి: ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస గ్రామానికి చెందిన చింతాడ ప్రేమ్‌కుమార్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు వైజ్ స్కూల్ కరస్పాండెంట్ వావిలపల్లి సంధ్యారాణి ఆదివారం తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో వలసకూలీలుగా ఉండగా, స్వగ్రామంలోని నాన్నమ్మ వద్ద ఉంటూ మండల కేంద్రంలోని వైజ్ స్కూల్‌లో చదువుకుని, పదో తరగతిలో 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడని, ఇప్పుడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు. సదరు విద్యార్థిని స్కూల్ యాజమాన్యం అభినందించింది.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



మునకలవలసలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో వరిపంటకు బదులుగా సాగు చేస్తున్న మొక్కజొన్న పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ ఏడాది మండలంలోని 800 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. సోమరాజుపేట, మునకలవలస, బాలకవివలస, బూరాడ, అంబఖండి తదితర గ్రామాల్లో ఈ పంట అధికంగా సాగు చేస్తున్నట్లు ఏవో మురళీకృష్ణ తెలిపారు.

పుస్తకపఠనంతో అపార జ్ఞానం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తకపఠనం ద్వారా అపారమైన జ్ఞానం కలుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పలు పుస్తకాలు చదివించి, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ ఏదో ఒక పుస్తకం చదవడం ద్వారా దానిలోని కొత్త విషయాలు మనకు తెలుస్తాయన్నారు. అనంతరం పుస్తకపఠనం, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో అనుసరించాల్సిన మెలకువలను విద్యార్థులకు నేర్పించారు. ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లోని చిల్డ్రన్స్‌క్లబ్‌లో విద్యార్థులు చేరాలని కోరారు.



రాజాంలో స్టూడెంట్ కిట్లు సర్దుబాటు చేస్తున్న ఎంఈవో దుర్గారావు(ఫైల్)

“ నిర్లక్ష్యం దిశగా పాఠశాల విద్య పయనిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం అస్తవ్యస్తంగా తయారవుతోంది. విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని పూర్తి నమ్మకంతో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తూ అన్నివిధాలా అభివృద్ధి చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పాఠశాలలకు అదనపు భవనాల మంజూరు, విద్యార్థులకు సకాలంలో విద్యాసామగ్రి అందజేత, మౌలిక సదుపాయాల కల్పన వంటివి జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందగలిగారు. అయితే ఇప్పుడు అధికార పీఠమెక్కిన చంద్రబాబు సర్కారు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయలేని పరిస్థితి కొన్నిచోట్ల కనిపిస్తోంది. మరికొన్నిచోట్ల మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలుచేయలేని దుస్థితి, ఇంకొన్ని చోట్ల విద్యార్థులను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత వంటివి తారసపడుతున్నా ప్రభుత్వ చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ”

నిర్లక్ష్యం దిశగా పాఠశాల విద్య

- కూటమి హయాంలో కుంటుపడుతున్న పాఠశాలల అభివృద్ధి
- సక్రమంగా అమలుకాని మధ్యాహ్న భోజనం మెనూ
- పూర్తిస్థాయిలో అందని స్టూడెంట్ కిట్లు
- విద్యార్థులను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి:

మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు పేరిట కొన్ని పాఠశాలల్లో మిగిలిన స్టూడెంట్ కిట్లను మిగతా సరిపడని పాఠశాలలకు అందజేశారు. ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై ఎంత అలసత్వం వహిస్తుందో చెప్పడానికి. ఇదిలా ఉంటే చాలా మండలాల్లోని పాఠశాలల్లో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మౌలిక సదుపాయాల కల్పన, మధ్యాహ్న భోజనం నాణ్యత, అమలులో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. మరోవైపు పలు

రాజాంలో ఉపాధ్యాయుల కొరత..

రాజాం పట్టణంతో పాటు మండలంలోని 35 ప్రభుత్వ ప్రాథమిక, 15 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలతో పాటు 1 ప్రభుత్వ కస్తూరిగాంధీ బాలికా విద్యాలయం ఉంది. గతంలో ఆయా పాఠశాలల్లో 6,500 మందికిపైగా విద్యార్థుల హాజరుశాతం ఉండేది. ఈ ఏడాది 6,100 మంది విద్యార్థులతో హాజరుశాతం నిలిచిపోయింది. మరోవైపు మండలంలోని పలు పాఠశాలల్లో 20కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాజాం నియోజకవర్గంలో మండలాల వారీగా విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
రాజాం	48	6,100
రేగిడి	81	5,650
వంగర	49	3,328
సంతకవిటి	75	4,335

పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత విపరీతంగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యపై నమ్మకం సన్నగిల్లి చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు ఉత్సుకత కనబరుస్తుండడం విచారకరం.

300 మందికి పైగా విద్యార్థులు తగ్గారు..


రేగిడి మండలంలోని 57 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం, సోషల్ వెల్ఫేర్ హైస్కూల్‌లు ఉన్నాయి. వీటిలో మొత్తం 5,650 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది కన్నా వీటిల్లో 300 మందికి పైగా విద్యార్థులు తగ్గుముఖం పట్టారు. కాగితాపల్లి, తునివాడ పాఠశాలల్లో రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సకాలంలో చెల్లింపులు కూడా చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

వంగర మండలంలో ఇలా..

మండలంలో 31 ప్రభుత్వ ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం, మరొక రెసిడెన్షియల్ స్కూల్ ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,328 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది ఈ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థుల చేరికలు తగ్గుముఖం పట్టాయి. ఈ మండలంలో 18కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉంటే పాఠశాలల్లో విద్యాబోధన, ఎండీఎం(మధ్యాహ్న భోజన పథకం) నిర్వహణపై పూర్తిగా పర్యవేక్షణ లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సంతకవిటి మండలంలో కూడా..

సంతకవిటి మండలంలో విద్యార్థులకు అందించిన స్టూడెంట్ కిట్ల పంపిణీలో అరకొరగా పుస్తకాల పంపిణీయే కనిపించింది. ఈ మండలంలో 53 ప్రభుత్వ ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది 4,335 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది ఈ మండలంలో 4,448 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 113 మంది విద్యార్థులు తగ్గారు. పాఠశాలల్లో సమయపాలన లేకపోవడం, విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందకపోవడం, స్టూడెంట్ కిట్లు సక్రమంగా పంపిణీ చేయకోవడం, విద్య సక్రమంగా అందకపోవడం వంటివి సమస్యలుగా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



బొబ్బిలిలోనూ ఉపాధ్యాయుల కొరత..

బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో అక్కడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడ ఉపాధ్యాయులు లేని కారణంగా సకాలంలో బోధన జరగడం లేదని చదువులు ఎలా సాగించాలని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామభద్రపురం, బాడంగి మండలాల్లో కలిపి మొత్తం 10 మంది ఉపాధ్యాయుల వరకు కొరత ఉండగా, మిగతా తెర్లాం, బొబ్బిలి మండలాల్లో కొన్నిచోట్ల ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు సమాచారం.

–బొబ్బిలి/బాడంగి/తెర్లాం/రామభద్రపురం

బొబ్బిలి నియోజకవర్గంలో మండలాల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలిలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
బొబ్బిలి అర్బన్/రూరల్	91	7,120
రామభద్రపురం	55	4,100
తెర్లాం	67	3,800
బాడంగి	42	3,065

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సత్యసాయి భక్తులు

బొబ్బిలి రూరల్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు కోరారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఏటా పెరుగుతున్న కాలుష్యంగా కారణంగా వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని, వేసవిలో ఎండలు బాగా కాయడం, శీతాకాలంలో విపరీతమైన చలి, వర్షాకాలంలో వరదలు, ప్రకృతి విపత్తులు వీటన్నింటికీ కారణం కాలుష్యం పెరిగిపోవడం, అడవుల శాతం తగ్గిపోవడమేనన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు బి.లక్ష్మణ, కె.సింహాచలం, రామునాయుడు, మధుసూదన్, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పట్టణంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు తెలిపారు. స్థానిక అమ్మవారి కాలనీలోని రామాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం వెయ్యి మొక్కలు... వెయ్యి వృక్షాలు పేరుతో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టామన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానికుల సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటామన్నారు. రెండు నెలల వ్యవధిలో లక్ష్యాన్ని పూర్తిచేశామని, 1100కు పైగా మొక్కలు నాటామని అన్నారు. ప్రతీ మొక్క సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పి.వేణుగోపాల్, పి.చైతన్యకుమార్, ఎం.వెంకటేష్, ఎం.శ్రీను, పి.గోవిందరావు, జి.అప్పలనాయుడు, ఎల్.శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన



అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రసాయనిక ఎరువులైన పురుగుమందులకు బదులుగా సేంద్రియ ఎరువులైన అగ్నిఅస్త్రాన్ని పంటలపై పిచికారీ చేస్తే పంటకు చీడపీడలు, తెగుళ్ల సోకవని, ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు చేతికివస్తాయన్నారు. అనంతరం అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగపూర్వకంగా వివరించారు. 10 లీటర్ల ఆవుమూత్రం, కిలో పొగాకు, అరకిలో వెల్లుల్లి, అరకిలో పచ్చిమిర్చి, 5 కిలోల వేపాకులను ఓ మట్టికుండలో వేసుకుని, బాగా కలపాలన్నారు. ఆ తర్వాత దానిని బాగా మరగబెట్టిన తర్వాత పలుచని గుడ్డలో వడకట్టి డబ్బాలో నిల్వచేసుకుని మూడు నెలల వరకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎకరా విస్తీర్ణంలోని పంట పొలానికి పిచికారీ చేయాలంటే 5 లీటర్ల అగ్నిఅస్త్రం, 2 లీటర్ల నీరు కలిపి వినియోగించుకోవచ్చన్నారు. ప్రతీ రైతు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టిసారిస్తే ఆరోగ్యవంతమైన పంటలను సమాజానికి అందించగలమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఆగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



బొబ్బిలి: ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, మహిళా కౌన్సిలర్లు



రాజాం సిటీ: స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం



రాజాం సిటీ: ఫ్రెండ్‌షిప్ డే జరుపుకుంటున్న మహిళలు

రాజాం సిటీ: పట్టణంలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్‌లోని సభ్యులంతా కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుని, సరదాగా గడిపారు. అనంతరం ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై ఆ సంస్థ సభ్యులు చర్చించారు. ఇదిలా ఉండగా, శ్రీనివాస కిట్టి గ్రూపు ఆధ్వర్యంలో మహిళలు స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు తమ స్నేహానికి గుర్తుగా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది.

బొబ్బిలి: పట్టణంలోని అన్నా క్యాంటీన్ భవనం వద్ద పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్ ఆధ్వర్యంలో జరిగిన స్నేహితుల దినోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే బేబినాయనకు మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, తినిపించుకున్నారు. ఇదిలా ఉండగా, పట్టణంలోని వెల్‌కమ్ బ్యాచ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పాటై 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక హ్యాండ్ ఇన్ హ్యాండ్ అర్ఫన్ హోమ్‌లో అనాథ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేయడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. వీర బొబ్బిలి మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం వినూత్నంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురికి సంఘ సభ్యులు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

సత్కార్యాలతో దైవానుగ్రహం

రేగిడి: ప్రతిఒక్కరూ సత్కార్యాలు చేసి, దైవానుగ్రహం పొందాలని శ్రీకాకుళం జిల్లా, బెండికొండ ఆశ్రమ పీఠాధిపతి నరసింహస్వామి అన్నారు. స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్త జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరూ దేశభక్తి, దైవభక్తి కలిగి ఉండాలని, ధర్మం కోసం అందరూ పాటుపడాలన్నారు. సత్యమే భగవంతుడు గనుక ప్రతి మానవుడు సత్యాన్ని ఆచరించాలన్నారు. దేవుడిపై అచంచల విశ్వాసం, నమ్మకం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్‌వీ రమణ పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. కార్యక్రమానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రక్తపరీక్షలు చేయించుకోవాలి



రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి శిరీష

రామభద్రపురం: జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారంతా రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష సూచించారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో పలువురు రోగులకు జ్వర నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో మురునీటి ప్రాంతాల్లో విపరీతంగా పెరిగే దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా వెంటనే రక్తపరీక్షలు చేసుకుంటే ఏ వ్యాధి అనేది తెలుస్తుందని, తద్వారా చికిత్స సులభమవుతుందన్నారు. డెంగీ సోకితే ప్లేట్‌లెట్స్ తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంతీర్పుపై పునఃసమీక్షించాలి



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న సంఘ సభ్యులు

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి, సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై పునఃసమీక్షించాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి, ఆదివారం నిరసన చేపట్టారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చన్న దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన రోజు తమకు బ్లాక్ డే అని అభివర్ణించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధంగా లేదన్నారు. ఈ విషయంపై మరోసారి ఆలోచించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొాలు చిరంజీవులు, కార్యదర్శి బొక్కేన రాము, కోశాధికారి డి.గోపాలం, జాయింట్ సెక్రటరీ పి.సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారు చివరిభాగం తొలగించండి



వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: వరినార్లు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయివలస గ్రామ పొలాల్లో వరినాట్లు వేసేటప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం అవగాహన కల్పించారు. వరినాట్లు పొలంలో నాటుకోవడానికి ముందు వాటిని శుద్ధి చేయాలని, అలాగే నారు చివరిభాగం తొలగించాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నారుకు పట్టిన వ్యాధికారక పురుగులు నశించి, పంట బాగా పండుతుందన్నారు. నాటేటప్పుడు ఒక వరినారు దుబ్బుకు నుంచి మరొక వరినారు దుబ్బుకు మధ్య తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలా చేస్తే గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఎకరాకు 5 కిలోల యూరియా, మరో 5 కిలోల డీఏపీని దమ్ములో వేసుకున్న తర్వాత వరినాట్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి, తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి



సంతకవిటి: పారిశుధ్య పనులపై ఆరాతీస్తున్న డీపీవో శ్రీధర్‌రాజా

సంతకవిటి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో(జిల్లా పంచాయతీ అధికారి) ఎల్.శ్రీధర్‌రాజా సూచించారు. మండలంలోని గోళ్లవలస పంచాయతీ పరిధిలోని ఎం.ఆరఫ అగ్రహారం, శంకరపేట గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో నెలకొన్న అపారిశుద్ధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు జ్వరాల బారినపడడంతో ఆయన ఆ గ్రామాలకు వెళ్లి, పరిస్థితిపై సమీక్షించారు. ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండిపోవడం, మురుగుకాలువల్లోని మురుగు కిందకు ప్రవహించకపోవడం, అక్కడే మంచినీటి కుళాయిలు కూడా ఉండడం వల్ల గ్రామాల్లోని ప్రజలు విషజ్వరాల బారినపడుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన సత్వరమే పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఈవోపీఆర్‌డీ పుష్పాంజలిని ఆదేశించారు. దీంతో శంకరపేటలో పారిశుధ్య పనులు చేపట్టి, కాలువల్లోని పూడికలు తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి దాలినాయుడు, మండల పరిషత్ పరిపాలనాధికారి రఘునాథాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లోని మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.

రాజాం సిటీ: మండల వ్యాప్తంగా పారిశుధ్య పనులు ముమ్మరం చేశామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని ఒమ్మి, నందబలగ, అంతకాపల్లి గ్రామాల్లోని కాలువల్లో పూడికలు తీయించే కార్యక్రమం ఆదివారం చేపట్టామన్నారు. మిగతా గ్రామాల్లో కూడా ఈ పనులు పూర్తి స్థాయిలో చేపట్టనున్నామన్నారు.

చేయి చేయి కలిపారు.. సాగునీరు తెచ్చుకున్నారు!



బాగుచేసిన తర్వాత కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

రేగిడి: ఎవరో వస్తారు.. ఏదో చూస్తారని చూడకుండా మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట గ్రామాల రైతులు సాగునీటి కాలువను బాగుచేసుకున్నారు. సాగునీరు తెచ్చుకున్నారు. మడ్డువలస రిజర్వాయరు 18ఎల్ఎఫ్10ఆర్ కాలువ పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో శివారు పంటపొలాలకు సాగునీరు అంతగా అందని పరిస్థితి. చాటాయివలస, వండానపేట గ్రామ సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణిల ఆధ్వర్యంలో 200 మంది రైతులు శ్రమదానం చేసి మరీ కాలువలోని పూడికలు, జంగిల్స్ తొలగించారు. ప్రస్తుతం ఆ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా రావడంతో రైతుల పనిని అందరూ మెచ్చుకుంటున్నారు. చేయి చేయి కలిపారు.. సాగునీరు తెచ్చుకున్నారని అభినందిస్తున్నారు.